సాక్షి
ఖమ్మం
శుక్రవారం। 1। మార్చి। 2024



ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

దాదాపు పదేళ్లకు 1వ తేదీనే రేషన్ బియ్యం పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా, షాపులకు ఇప్పటికే బియ్యం చేరవేశారు. 8లో



మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

కొణిజర్ల మాజీ సర్పంచ్ రామారావుపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడగా తీవ్రగాయాలయ్యాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 21°

జిల్లాలో శుక్రవారం ఎండల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచి ఎండమొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.10కోట్లు

ఖమ్మంఅర్బన్/వైరా రూరల్: జిల్లాలోని సాగు నీటి వనరుల అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై జలవనరులశాఖ అధికారులు రూ.400 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఇందులో గురువారం రూ.10.65 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపాన వైరా నదిలో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.4.71 కోట్ల నిధులు ఉన్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా, గురువారం నిధులు మంజూరు జాబితాలో ఈ పనులు చేర్చారు. ఇదే గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద స్నానపు గదుల నిర్మాణానికి రూ.65లక్షలు, మధిర మండలం సిరిపురం వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి రూ.5.32 కోట్లు కేటాయించారు.

పంట మార్పిడి విధానంతో మేలు



మిర్చి తోటలో పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

మధిరరూరల్: ఏటా ఒకటే పంట కాకుండా రైతులు పంట మార్పిడి విధానం పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల తెలిపారు. మండలంలోని నాగవరప్పాడులో మిర్చి, మొక్కజొన్న, పెసర పంటలను గురువారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. ఏటా ఒకే పంట కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగా పంటలు ఎంచుకోవాలని సూచించారు. అలాగే, పత్తి, కంది, అపరాలు పంటలతో పాటు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు, ఏఈఓలు నిఖిత, సింధూర్ పాల్గొన్నారు.

4న సత్తుపల్లిలో గ్రీవెన్స్‌డే

ఖమ్మం సహకారనగర్: సమస్యలు విన్నవించేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వస్తున్న ప్రజలకు దూరాభారం తగ్గించేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఇటీవల మధిరలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించగా, ఈనెల 4న సత్తుపల్లిలో నిర్వహించనున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డులో ఉన్న లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేయొచ్చని కలెక్టర్ వెల్లడించారు.

ఖమ్మంకు జాతీయస్థాయి అవార్డు

ఖమ్మంమయూరిసెంటర్: ఉత్తమ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ విభాగంలో ఖమ్మంకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. కేంద్ర హౌజింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖ ప్రకటించిన అవార్డులకు రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్‌తోపాటు ఖమ్మంకు కూడా స్థానం దక్కింది. గృహనిర్మాణం, పట్టణాభివృద్ధికి సంబంధించిన నియమాలు, నిబంధనలు, చట్టాలను పటిష్టంగా అమలుచేస్తున్న నగరాలకు ఈ అవార్డు అందజేస్తారు. ఈమేరకు 5వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేఎంసీ బాధ్యులు అవార్డు స్వీకరించనున్నారు.

'ద్వితీయ' పరీక్షలు ప్రారంభం



సత్తుపల్లిలో ఆలస్యంగా రావడంతో బయటే ఉన్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 70 కేంద్రాల్లో 17,007మందికి గాను 16,540మంది విద్యార్థులు హాజరుకాగా, 467మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తుండగా విద్యార్థులను 8గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. చాలావరకు కేంద్రాల్లో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తనిఖీ చేయగా, డీఐఈఓతో పాటు హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 37 కేంద్రాలను తనిఖీ చేశాయి.

నిమిషం నిబంధనతో ఇద్దరు వెనక్కి..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాల కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. నిమిషం నిబంధన కారణంగా వారిని అధికారులు అనుమతించక పోవడంతో వెనక్కి వెళ్లారు.

గిరిజన కుంభమేళాగా పిలిచే ములుగు జిల్లాలోని మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడిపించిన ఆర్టీసీకి కాసుల పంట పండింది. గతనెల 18 నుంచి 25వ తేదీ వరకు ఖమ్మం రీజియన్ నుంచి భక్తుల కోసం 310 ప్రత్యేక సర్వీసులు నడిపించారు. ఈ బస్సుల్లో 2,36,909 మంది భక్తులు వెళ్లగా, సంస్థకు రూ.3,53,83,515 ఆదాయం సమకూరింది. – ఖమ్మంమామిళ్లగూడెం

ఆర్టీసీకి జాతర !



కొత్తగూడెం బస్టాండ్ నుంచి మేడారం బయలుదేరుతున్న భక్తులు (ఫైల్)

మేడారం సర్వీసులతో రూ.3కోట్లకు పైగా ఆదాయం

- అత్యధికంగా కొత్తగూడెం డిపోకు రూ.1.23కోట్లు
- రీజియన్ నుంచి జాతరకు 310 బస్సులు
- బస్సుల్లో తరలిన 2,36,909 మంది భక్తులు

గతం కంటే ఎక్కువే..

గత జాతరలో 1,33,141 మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో మేడారం వెళ్లారు. అయితే, ఈసారి మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో రద్దీ పెరుగుతుందనే అంచనాతో అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఖమ్మం రీజియన్‌తోపాటు ఇతర డిపోల నుంచి బస్సులను రప్పించి భక్తులకు అందుబాటులో ఉంచారు. రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి 310 సర్వీసులు నడిపించగా 2,36,909 మంది భక్తులు మేడారం వెళ్లివచ్చారు. గత జాతరతో పోలిస్తే దాదాపు 80 శాతం మంది భక్తులు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవడం విశేషం.

3,080 ట్రిప్పులు

మేడారం వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్ నుంచి తొలుత అధికారులు 494 బస్సులు నడిపించాలని నిర్ణయించారు. ఆతర్వాత పరిస్థితుల దృష్ట్యా 310 బస్సులు మాత్రమే నడిపారు. గతనెల 18 నుంచి 25 వరకు ఎనిమిది రోజుల పాటు ఈ బస్సులు 3,080 ట్రిప్‌లు నడవగా, 5,62,307 కిలోమీటర్ల మేర ప్రయాణించాయి. తద్వారా ఆర్టీసీకి రూ.3,53,83,515 ఆదాయం సమకూరగా, సగటున కి.మీ.కు రూ.62.93 ఆదాయం నమోదైందని అధికారులు వెల్లడించారు.

కొత్తగూడెం డిపో నుంచే ఎక్కువ

ఖమ్మం రీజియన్ పరిధిలో కొత్తగూడెం డిపో నుంచే మేడారం జాతరకు ఎక్కువ బస్సులు నడిచాయి. ఈ డిపో నుంచి 119 బస్సులు 641 ట్రిప్‌లుగా నడిపించారు. మొత్తంగా 2,08,690 కిలోమీటర్లు తిరగడం ద్వారా ఈ డిపోకు రూ.1,23,87,179 ఆదాయం వచ్చింది. 94 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ఇక్కడి నుంచి బస్సులు నడవగా 67,040 మంది భక్తులు మేడారం వెళ్లారు. ఇక మధిర డిపో నుంచి తక్కువగా 20 బస్సులే నడవడంతో ఈ డిపో ద్వారా రూ.25,56,625 ఆదాయం వచ్చింది. ఇక్కడి నుంచి బస్సులు 82 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. కాగా, ఆర్టీసీ సేవలను వినియోగించుకున్న భక్తులకు ఖమ్మం రీజియన్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

డిపోల వారీగా మేడారం జాతర ఆదాయం

డిపో	బస్సుల సంఖ్య	ఆదాయం
ఖమ్మం	85	రూ.59,97,780
మధిర	20	రూ.25,56,625
సత్తుపల్లి	33	రూ.34,96,899
భద్రాచలం	30	రూ.57,32,932
కొత్తగూడెం	119	రూ.1,23,87,179
మణుగూరు	23	రూ.52,12,100
మొత్తం	310	రూ.3,53,83,515

మహాలక్ష్మితో పెరిగిన రద్దీ..

ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో వారే కాక కుటుంబమంతా ఆర్టీసీ బస్సులనే ఎంచుకున్నారు. దీంతో రీజియన్ నుంచి 2,36,909 మంది భక్తులు బస్సుల్లో మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వెళ్లారు. ఇందులో 90,628 మంది పురుషులు ఉండగా.. మహిళలు 1,46,281 మంది ఉండడం విశేషం. జాతర సర్వీసుల్లో సగటున 98శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్

కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలో బీఆర్‌ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇటీవల నలుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ చేరగా, గురువారం 59వ డివిజన్ కార్పొరేటర్ బట్టపోతుల లలితారాణి కూడా హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్పొరేటర్‌తో పాటు సుమారు వంద మంది బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరగా, మంత్రి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.



కార్పొరేటర్ లలితారాణికి కండువా కప్పుతున్న మంత్రి పొంగులేటి

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించండి

కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ధరణికి సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ధరణి నూతన మార్గదర్శకాలపై అధికారులతో సమీక్షించారు. కొత్త మార్గదర్శకాలపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లు అవగాహన పెంపొందించుకుని దరఖాస్తులపై దృష్టి సారించాలని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమైన ఆయన ప్రహరీ, అభిషేక మండపం, వేదిక, స్నానాల గదులు, టాయిలెట్లు నిర్మించాలని తెలిపారు. అలాగే, తీర్థాల ఆలయ ప్రహరీ నిర్మాణాన్ని మహాశివరాత్రిలోగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. కాగా, జిల్లాలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన అధికారులను కలెక్టర్ గౌతమ్ సన్మానించారు.



దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, డీడబ్ల్యూఓ సుమను సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, వివిధ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, విజయనిర్మల, హరికిషన్, సత్యనారాయణ, శ్రీనివాస్, సులోచన, కె.దుర్గాప్రసాద్, రమణ, గణేషన్, హరిచంద్రశేఖర్, నాగలక్ష్మి, అరుణ, మీనన్, మదన్‌గోపాల్, సత్యనారాయణ, రాంబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి నిఘా

- ప్రమాదాల నివారణకు సూచికబోర్డులు
- నేర సమీక్షా సమావేశంలో సీపీ సునీల్‌దత్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఎట్టి పరిస్థితుల్లోనూ కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలో గురువారం జరిగిన నేర సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ పోలీస్, మైనింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిఘా వేసి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు రాష్ట్రాల నుండి ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే, జూదం, కోడిపందేలు, బహిరంగంగా మద్యం సేవించడం వంటి కార్యకలాపాలను కట్టడి చేయాలని సీపీ తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరా ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. ఆతర్వాత పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీసిన సీపీ విచారణపై సూచనలు చేశారు. కాగా, రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించేలా ఖమ్మం రూరల్, కొణిజర్ల, వైరా ప్రాంతాల్లో వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటుచేసి, అవసరమైన చోట డివైడర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ గణేష్, ఏసీపీలు రమణమూర్తి, రఘు, ప్రసన్నకుమార్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు జరుగుతున్నందున భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు గురువారం మంత్రిని కలిశారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీని పాత కలెక్టరేట్‌లో నిర్వహిస్తుండగా, కొత్త భవనాల నిర్మాణానికి ఐదెకరాల స్థలం అందుబాటులో ఉందని వారు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మెడికల్ కాలేజీ భవనం, వసతిగృహం, ప్రిన్సిపాల్ క్వార్టర్ల నిర్మాణంతో పాటు భవిష్యత్ అవసరాలకు సరిపడా భవనాలపై కలెక్టర్‌తో చర్చించాలని సూచించారు. ఆధునిక హంగులతో నాణ్యత లోపం లేకుండా నిర్మాణాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ భవనాలు ఉండేలా తీర్చిదిద్దాలని తెలిపారు.

పకడ్బందీగా జవాబుపత్రాల రవాణా



జవాబుపత్రాలను పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతుండగా, సమాధాన పత్రాల బండిళ్ల రవాణాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో బండిళ్లు కానరాకుండా పోవడంతో ఈసారి పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సెంటర్ల నుంచి ఖమ్మంకు ఆర్టీసీ బస్సుల్లో జవాబుపత్రాలు పంపిస్తుండగా, నిత్యం 160 నుంచి 170 బండిళ్ల వస్తున్నాయి. ఆతర్వాత పోలీసులు, పోస్టల్ శాఖ ఉద్యోగుల సమక్షాన నయాబజార్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్‌కు చేర్చి, జంబ్లింగ్ విధానంలో రైల్వే మెయిల్ ద్వారా కేటాయించిన వాల్యుయేషన్ కేంద్రాలకు పంపిస్తున్నారు.

ఖమ్మం కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు



ఆనందమానందమాయె..

- ఏళ్ల తర్వాత డీఎస్సీకి మోక్షం
- 'మెగా' ప్రకటనతో నిరుద్యోగుల్లో హర్షం
- ఉమ్మడి జిల్లాలో 1,022 పోస్టులు
- గత నోటిఫికేషన్‌తో పోలిస్తే పెరిగిన వైనం

సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ పోస్టుల పరీక్ష కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డీఈడీ, బీఈడీ పూర్తిచేయడమే కాక టెట్ అర్హత సాధించిన పలువురు ఎదురుచూస్తుండగా.. ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 1,022 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించగా.. అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 575 పోస్టులు ఉండగా, భద్రాద్రి జిల్లాలో 447 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. – ఖమ్మం సహకారనగర్

2017 తర్వాత ఇప్పుడే..

2017లో టీఆర్‌టీ ద్వారా రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. అనంతరం ఏళ్ల తరబడి నిరీక్షించగా గత ప్రభుత్వం 2023లో మరోమారు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు కూడా స్వీకరించింది. అదే సమయాన టెట్ కూడా నిర్వహించింది అయితే, రాతపరీక్ష కంటే ముందే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పరీక్ష వాయిదా పడింది.

కొత్తప్రభుత్వంలో సరికొత్తగా..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా.. గత ఏడాది నోటిఫికేషన్‌తో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాల వారీగా ఖాళీలు కూడా వెల్లడించడంతో అభ్యర్థులు చదువుపై దృష్టి సారించనున్నారు. కాగా, భద్రాద్రి జిల్లాలో గత ఏడాది 185 పోస్టులతో నోటిఫికేషన్ రాగా, ఈసారి 262 పోస్టులు పెంచి 447 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. కానీ జిల్లాలో 700కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా.

35వేల మందికి పైగానే...

బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి పైగానే ఉంటారని అంచనా. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడంతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ మొదలుపెట్టనున్నారు. ఇప్పటికే అభ్యర్థులు పలువురు పరీక్షలకు సిద్ధమవుతుండగా.. మరికొందరు నోటిఫికేషన్‌పై స్పష్టత లేకపోవడంతో ఇతర ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులపై స్పష్టత ఇవ్వడంతో మళ్లీ సన్నద్ధతపై దృష్టి సారించనున్నారు.

ఆన్‌లైన్‌లో పరీక్ష

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి డీఎస్సీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనిని నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతిస్తున్నారు. ఆన్‌లైన్ విధానం కావడంతో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ఈనెల 4వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పరీక్ష, నియామకాలు పూర్తిచేసి ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు

	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
స్కూల్ అసిస్టెంట్లు	176	129
లాంగ్వేజ్ పండిట్	18	10
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	10	01
ఎస్‌జీటీ	334	268
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	08	08
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	29	31
మొత్తం	575	447

ఆనందంగా ఉంది..



ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే నోటిఫికేషన్ విడుదల చేయటంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాలాంటి వారికి శుభ పరిణామం. పరీక్ష పకడ్బందీగా నిర్వహించి వచ్చే విద్యాసంవత్సరం నాటికి నియామకాలు చేపడితే మంచిది. – షేక్ షరీఫ్, కొణిజర్ల

ఏళ్లుగా ఎదురుచూపులు



డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు మెగా డీఎస్సీ పేరిట గతం కంటే పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇవ్వడం హర్షణీయం. గత కొన్నేళ్లుగా పరీక్ష కోసం సిద్ధమవుతున్నా. ఈ సారి పోస్టుల సంఖ్య పెరిగినందున ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పరీక్షకు సిద్ధమవుతా. – గౌస్‌పాషా, ఖమ్మం

ఆశాజనకమే...



2017 తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదు. 2023లో ఎన్నికల ముందు నోటిఫికేషన్ ఇచ్చినా పోస్టులు తక్కువగానే ఉండడంతో నిరాశ చెందాం. ఇప్పుడు ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆశాజనకంగా ఉంది. నేను కొన్నేళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. – ఇబ్రహీం, ఖమ్మం

ఆహారంలో మార్పులు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్ వలీ

- సిరి ధాన్యాలు తినడం అలవాటు చేసుకోవాలి
- పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోకపోతే ప్రమాదం పొంచి ఉన్నట్లేనని గుర్తించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణమండపంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యాన 'సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం' అంశంపై సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పూర్వకాలంలో సిరి ధాన్యాలతోనే చేసిన ఆహారం తీసుకుంటూ వ్యాధులకు దూరంగా ఉన్నారని తెలిపారు. వందేళ్ల క్రితం వరి బియ్యం కూడా ఉండేవి కావని, మందుల కంపెనీలు వ్యాపారం కోసం వరిని అలవాటు చేశాయని చెప్పారు. కాగా, పులుపు ఆరోగ్యానికి ముఖ్యమైదని, నిమ్మకాయ ఊరగాయ తీసుకుంటే మంచిదని చెప్పారు. అలాగే, ఎంతో మేలు చేసే అంబలిని ప్రతిరోజు ఒక్కపూటైనా తీసుకోవాలని సూచించారు. ఇక పాలతో కాకుండా నువ్వులతో కాల్షియం అందుతుందనే విషయాన్ని గుర్తించాలని ఆయన తెలిపారు. సిరి ధాన్యాలతో పూరీలు, బిర్యానీలు ఏదైనా చేసుకునే అవకాశమున్నందున వీటిని సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని కోరారు. జీవితకాలాన్ని పెంచుకోవడంతో పాటు సంతాన లేమి సమస్యను సిరి ధాన్యాలతోనే ఎదుర్కోగలమని ఖాదర్ వలీ తెలిపారు. అనంతరం రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడగా కమ్మ మహాజన సంఘం కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావుతో పాటు నల్లమోతు రఘు, బండి మాధవరావు, రావూరి సైదుబాబు, నవీన్, బయ్యన బాబురావు, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

ముదిగొండ: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ముదిగొండ మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని సీతారంపురం, మేడేపల్లి, గోకినేపల్లి, వెంకటాపురం, ముదిగొండ గ్రామాల్లో భట్టి పర్యటిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి ఎమ్మెల్యే సండ్ర తదితరులు

వేంసూరు: మండలంలోని కందుకూరులో సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబా విగ్రహాన్ని అలంకరించగా పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. కాగా, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి రూ.1.11లక్షల విలువైన ఆభరణం

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలుచేశారు. ఈసందర్భంగా సత్తుపల్లికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి రూ 1,11,500 విలువైన మంగళసూత్రాన్ని సమర్పించారు.

మహిళా వ్యాపారులపై పరిశోధనకు డాక్టరేట్


గోరంట్ల స్వప్న

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన గోరంట్ల స్వప్నకు కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ లభించింది. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.స్వరూపరాణి పర్యవేక్షణలో ఆమె 'తెలంగాణలో చిరు వ్యాపార మహిళల సమస్యలు, అవకాశాలు – అధ్యయనం' అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ పరిశోధనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.


'సాయిస్ఫూర్తి'లో న్యాక్ బృందం పరిశీలన

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల న్యాక్ బృందం పరిశీలన పూర్తయింది. కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతితో పాటు పలువురు కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. విద్యార్థులకు ఉన్న వసతులు, బోధనా సౌకర్యాలు, హాస్టళ్లు, డిజిటల్ క్లాస్ రూమ్స్, అధ్యాపకులు చేసిన పరిశోధనలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఈబృందం ఇచ్చే నివేదిక ఆధారంగా తమ కళాశాలకు గుర్తింపు లభించనుందని సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కాగా, తమ కళాశాలను స్వయం ప్రతిపత్తి దిశగా తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, అధ్యాపకులు కె.రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రదాత నారాయణరావు..

ఖమ్మంసహకారనగర్: వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందేలా కృషిచేసిన శ్రీరామభక్త గెంటేల నారాయణరావు విద్యాప్రదాతగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన మనవరాలు కొలిపాక అన్నపూర్ణ రాసిన 'శ్రీరామభక్త గెంటేల నారాయణరావు – సంగ్రహ చరిత్ర' పుస్తకాన్ని గురువారం ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ.వీ.రెడ్డి, జీవన్‌కుమార్ మాట్లాడుతూ 1956లోనే అప్పటి ప్రభుత్వానికి కళాశాల నిర్మాణం కోసం నారాయణరావు రూ.లక్ష విరాళమిచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమాసత్యవతి, అటానమస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యంతో పాటు డాక్టర్ శ్రీనివాసులు, పి.అనురాధ, డాక్టర్ జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర టు భద్రాచలం


కాలినడకన భద్రాద్రి వెళ్తున్న మహారాష్ట్ర వాసులు

కామేపల్లి: భద్రాచలం శ్రీసీతారామస్వామి దర్శనం కోసం మహారాష్ట్రకు చెందిన ఐదుగురు భక్తులు కలినడకన వెళ్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గణేష్‌పూర్ గ్రామానికి చెందిన సీతారాం, గోకుల్, మాణిక్‌దంగర్, చాంగునా, దిలీప్ 40 రోజుల కితం స్వస్థలం నుంచి బయలుదేరారు. ఈమేరకు వారు గురువారం కామేపల్లి మండలానికి చేరగా, మరో మూడు రోజుల్లో శ్రీ సీతారామస్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- 1వ తేదీ నుంచే రేషన్ బియ్యం పంపిణీ
- పదేళ్ల తర్వాత సకాలంలో ప్రారంభం
- ఇప్పటికే షాప్‌లకు చేరిన బియ్యం


ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం లోడ్ చేస్తున్న హమాలీలు

ఖమ్మం సహకారనగర్: సుమారు పదేళ్ల తర్వాత రేషన్‌షాపుల్లో ఒకటో తేదీ నుంచి బియ్యం సరఫరా మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన అందించే బియ్యం పంపిణీని 1వ తేదీనే మొదలుపెట్టాలని ఆదేశాలు అందాయి. దీంతో శుక్రవారం నుంచి జిల్లాలో బియ్యం సరఫరాకు డీలర్లు సిద్ధమయ్యారు.

19 లక్షల మందికి పైగా లబ్ధిదారులు

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాలు.. 4,11,315 కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రతా కార్డులు 3,84,483, అంత్యోదయ కార్డులు 26,829, అన్నపూర్ణ కార్డులు 3 ఉండగా, అన్నింట్లో కలిపి 11,31,487 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ నెలనెలా 72,81,357 కిలోల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 27 మండలాల్లో 551 రేషన్‌షాపులు ఉండగా 2,93,300 కార్డులు ఉన్నాయి. వీటిలో ఆహార భద్రతా కార్డులు 2,74,496, అంత్యోదయ కార్డులు 18,801, అన్నపూర్ణ కార్డులు 3 ఉండగా, లబ్ధిదారులు 8,39,744మంది ఉన్నారు. వీరికి 10,52,522 కిలోల బియ్యం అవసరమవుతాయనే అంచనా రేషన్ షాపుల్లో సిద్ధం చేశారు.

గతంలో గందరగోళం.

గత ప్రభుత్వ హయంలో సుమారు పదేళ్ల పాటు రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగింది. ఏ నెలలో ఎప్పుడు బియ్యం పంపిణీ మొదలవుతుందో తెలియని పరిస్థితి ఉండేది. ఉన్నతస్థాయి ఆదేశాల కోసం నెలనెలా ఎదురుచూడడం.. ఆదేశాలు అందక బియ్యం పంపిణీ మొదలుపెట్టినా ఎన్ని రోజులు ఇస్తారో తెలియకపోయేది. దీంతో లబ్ధిదారులు నెల మొదటి నుంచి రేషన్ దుకాణాల చుట్టూ తిరగడం కనిపించేది. పలుమార్లు లబ్ధిదారుల అవస్థ చూడలేక డీలర్లే పైనుంచి ఆదేశాలు రాగానే బియ్యం పంపణీ తేదీ తెలియచేస్తామని నచ్చచెప్పి పంపించేవారు.

నూతన సంస్కరణలు

ఇటీవల ఏర్పడిన ప్రభుత్వం ఒక్కో శాఖపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సీఎంఆర్‌పై దృష్టి సారించి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో వేగం పెంచారు. ఇక ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా ప్రతినెల 1నుంచి 15వ తేదీ వరకు మాత్రమే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించింది. ఇక ఏ నెల కూడా ఎట్టి పరిస్థితుల్లో ఈ తేదీల్లో మార్పులు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో శుక్రవారం నుంచి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు డీలర్లు సిద్ధమయ్యారు.

దుకాణాలకు చేరిన బియ్యం

జిల్లాలోని రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్) పాయింట్ల బియ్యాన్ని సరఫరా చేశారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచే దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తుండగా దాదాపు 80శాతం బియ్యం డీలర్లకు చేరింది. గత నెలలో మిగిలిన బియ్యం కలుపుకుంటే ఈ నెలలో లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా,సుమారు పదేళ్ల తర్వాత 1వ తేదీన బియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుండడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



	షాపులు	మొత్తం కార్డులు	లబ్ధిదారులు
ఖమ్మం	748	4,11,315	11,31,487
భద్రాద్రి కొత్తగూడెం	551	2,93,300	8,39,744
మొత్తం	1,299	7,04,615	19,71,231

నేటి నుంచి పంపిణీ



జిల్లాలోని లబ్ధిదారులకు 1వ తేదీనే రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటికే రేషన్‌షాపులకు దాదాపు బియ్యం చేరవేశాం. శుక్రవారం నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాని డీలర్లకు సూచించాం.

– చందన్‌కుమార్, డీఎస్ఓ, ఖమ్మం

షాపులకు 80 శాతం మేర బియ్యం



ప్రభుత్వం 1వ తేదీ నుంచే బియ్యం పంపిణీ చేయాలని సూచించిన నేపథ్యాన ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దుకాణాలకు బియ్యం సరఫరా చేశాం. ఇప్పటి వరకు 80శాతం బియ్యం దుకాణాలకు చేరింది. ఎక్కడైనా మిగిలినా శుక్రవారంతో సరఫరా పూర్తవుతుంది.

– జి.శ్రీలత, డీఎం, పౌరసరఫరాల సంస్థ, ఖమ్మం

ఉద్యోగుల పేరిట బ్యాంకుకు కుచ్చుటోపీ

- తప్పుడు పత్రాలతో రూ.60 లక్షల మేర రుణాలు
- ముఠాలో సభ్యుల నడుమ విబేధాలతో బయటకు...

ఖమ్మంక్రైం: ప్రభుత్వ ఉద్యోగుల పేరిట నకిలీ పత్రాలతో ఎస్‌బీఐలోని వివిధ బ్రాంచ్‌ల్లో రూ.60లక్షల రుణాలు ఇప్పించిన ముగ్గురిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసు నమోదు చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం... గుగ్గిళ్ల విజయ్‌కుమార్, నల్లగట్ల కరుణాకర్, నజీర్, ప్రశాంత్ ముఠాగా ఏర్పడి కోటమర్తి దినేష్‌కుమార్‌తోపాటు మరో ఎనిమిది మందిని కూడగట్టారు. ఆయా వ్యక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా చెబుతూ నకిలీ గుర్తింపు కార్డులు, శాలరీ సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్లు సృష్టించి ఎస్‌బీఐ అధికారులను నమ్మించారు. అనంతరం వారికి రుణాలు ఇప్పిస్తే ముఠా సభ్యులకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదేక్రమంలో బ్యాంక్ అధికారులను నమ్మించి వివిధ బ్రాంచ్‌ల్లో రూ.60లక్షల మేర రుణాలు తీసుకోగా, గత మూడు నెలలుగా ఈఎంఐలు కూడా చెల్లిస్తుండడంతో బ్యాంక్ అధికారులకు ఎలంటి అనుమానం రాలేదు. ఇటీవల ముఠా సభ్యుల్లో డబ్బు పంపకాలపై గొడవ రావడంతో ఒకరు ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐ రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా అసలు మోసం బయటపడింది. ఈమేరకు గుగ్గిళ్ల విజయ్, కరుణాకర్‌తో పాటు రుణం పొందిన దినేష్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేశారు. మిగతా వారి కోసం పోలీసులు గాలిస్తుండగా, ఈ వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగుల్లో ఎవరి పాత్ర అయినా ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

సత్తుపల్లిరూరల్: మందు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనను అందరూ బాధ్యతగా భావించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ప్రోగ్రాం అధికారి సత్యకుమార్ సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్ లీడర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత నవ సమాజాన్ని నిర్మించడంలో యువత కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ యూత్ కోఆర్డినేటర్ గందె రమేష్, ఆర్‌పీలు ప్రొఫెసర్ నర్సింహారావు, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మాట్లాడారు. ఆతర్వాత సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సమావేశంలో విహాన్ స్వచ్ఛంద సంస్థ అధికారి నాగమణి, ఐసీటీసీ కౌన్సిలర్ కుబేరుడు, అధ్యాపకులు డాక్టర్ జాకీర్ హుస్సేన్, కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ విజిలెన్స్ తనిఖీలు

పలు పనుల రికార్డుల స్వాధీనం, 140 పనులపై ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: 'సుడా' పరిధిలో నిర్వహించిన పనులకు సంబంధించి విజిలెన్స్ అధికారులు ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన తనిఖీలు రెండోరోజైన గురువారం కూడా కొనసాగాయి. ఎల్ఆర్ఎస్‌తోపాటు ఎస్‌డీఎఫ్ నిధులతో సుడా ఆధ్వర్యాన చేపట్టిన పనులపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం 15 పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు బుధవారం ఎనిమిది పనులకు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, గురువారం మరో ఆరు పనుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, మున్నేరుపై ప్రకాష్‌నగర్ వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన వారు పూర్తి వివరాలు సేకరించారు.

ఉద్యోగుల్లో ఆందోళన

తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు నిధుల మంజూరుపై దృష్టి సారించినట్లు తెలిసింది. గతంలో పనిచేసిన ఓ అకౌంట్ అధికారి 140 పనులకు నిధులు మంజూరు చేయగా.. వీటన్నింటి వివరాలు, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపుల రికార్డులు పరిశీలించినట్లు సమాచారం. అయితే, విజిలెన్స్ అధికారులు లోతుగా అన్ని వివరాలను సేకరిస్తుండటంతో కొందరు అధికారుల్లో ఆందోళన మొదలైందని కేఎంసీలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఎల్ఆర్ఎస్ నిధులతో చేపట్టిన పనులను పర్యవేక్షించిన అధికారులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. అయితే, తనిఖీలు ఇంకొన్ని రోజులు కొనసాగనుండగా, మరిన్ని పనులపై దృష్టి సారించనున్నట్లు తెలిసింది.

చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలల జైలుశిక్ష

సత్తుపల్లిటౌన్: తీసుకున్న అప్పుచెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఉపాధ్యాయుడికి జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కే.ఆయేషాసరీన్ గురువారం తీర్పు వెలువరించారు. సత్తుపల్లికి చెందిన గోళ్ల సూర్యచంద్రరావు వద్ద సత్తుపల్లి మండలం పాకలగూడెం పాఠశాల ఉపాధ్యాయుడిగా అమిదేపురం హరికిరణ్‌కుమార్ 2016 డిసెంబర్ 20వ తేదీన రూ.8 లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2017 డిసెంబర్ 20న ఆయన చెక్కు ఇవ్వగా ఖాతాలో నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో సూర్యచంద్రరావు తన న్యాయవాది షేక్ బుజ్జీసాహెబ్ ద్వారా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈమేరకు ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం హరికిరణ్‌కుమార్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.16 లక్షలు చెల్లించాలంటూ జడ్జి తీర్పు వెలువరించారు.

ఖమ్మం వాసికి ఏడాది...

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం బ్యాంక్ కాలనీకి చెందిన బానోత్ మమతకు మద్యపాన అబ్కారీ ప్రతేక న్యాయస్థాన న్యాయాధికారి రాళ్ల బండి శాంతిలత ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. నగరంలోని శుక్రవారిపేటకు చెందిన షేక్ జమాలుద్దీన్ బేగం వద్ద మమత 2017 మే 14న రూ.1.60 లక్షలు తీసుకుంది. తిరిగి ఇచ్చే క్రమాన అదే ఏడాది జూన్ 25న చెక్కు జారీ చేయగా ఆమె సంతకంలో తేడాతో చెక్కు చెల్లలేదు. దీంతో జమలాద్దీన్ తన న్యాయవాది ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా, వాదనల అనంతరం జైలుశిక్ష విధించడంతో పాటు నగదు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

- తీవ్రంగా గాయపడిన రామారావు
- కొణిజర్లలో ఉద్రిక్తత, పోలీస్ పికెట్ ఏర్పాటు


రామారావు నుంచి వివరాలు సేకరిస్తున్న వైరా సీఐ సాగర్‌నాయక్


దాడికి ఉపయోగించిన ఆయుధం

కొణిజర్ల: కొణిజర్ల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సూరంపల్లి రామారావుపై బుధవారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై మారణాయుధంతో దాడి చేయగా పొట్టతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... రామారావు బుధవారం స్థానికంగా ఓ వివాహ వేడుకకు హాజరై రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయాన మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చిన ఆయన ఇంటి వెనక బాత్‌రూమ్ వైపు వెళ్లగా అక్కడ మాటు వేసిన గుర్తుతెలియని వ్యక్తులు పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో రామారావు ఇంట్లోకి పారిపోతుండగా ఉన్న బల్లెంతో దాడి చేయగా, పొట్టలో ఎడమ పక్క దిగబడింది. ఈమేరకు ఆయన ఇంట్లోకి పరుగెత్తి తల్లి సుశీలకు చెబుతూనే బయటకు రాగా, వివాహ వేడుక వద్ద ఉన్న వారు రామారావును ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనను ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, ఘటనాస్థలిని వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్, సీఐ సాగర్ నాయక్ సందర్శించి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఖమ్మం ఆస్పత్రిలో రామారావుతో మాట్లాడి వివరాలు సేకరించారు.

పోలీస్ పికెట్

రామారావుపై హత్యాయత్నం జరిగిందనే ప్రచారంతో కొణిజర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో ఎలాంటి ఘటనలు జరగకుండా మండల కేంద్రంలో 144 సెక్షన్ విధించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కాగా, రామారావు ఆస్పత్రిలో పోలీసులకు వెల్లడించిన వివరాల ఆధారంగాపోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. భూవివాదం కారణంగా దాడి జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రామారావుపై దాడి సందర్భంగా పెనుగులాటలో నిందితుడి టీషర్టు ఘటనా స్థలంలోనే పడిపోగా దాంతో పాటు మారణాయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఏడాదిన్నర క్రితం కూడా రామారావుపై నక్సల్స్ పేరుతో కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు.

మంత్రి పొంగులేటి పరామర్శ

గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన రామారావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఖమ్మంలో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను సీపీ సునీల్‌దత్‌తో కలిసి పరామర్శించగా, నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు!

ఖమ్మం యువతిని అభినందించిన సీపీ


శృతిని అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది ఖమ్మంకు చెందిన కోలపుడి యువతి శృతి. ఖమ్మంలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పుల్లమ్మ పనిచేస్తుండగా, ఆమె భర్త పెయింటర్‌గా కొనసాగుతున్నారు. వీరి పెద్దకుమార్తె శృతి ఇంటర్ వరకు గురుకుల పాఠశాలలో చదివాక ఓయూలో ఉన్నత విద్య పూర్తి చేసకుంది. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్, గురుకుల స్కూల్ లైబ్రేరియన్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ ఈఓతో పాటు గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగాలు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను గురువారం ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, శృతి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లంపాడు వాసికి మూడు ఉద్యోగాలు


చక్రపాణి

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన ఆంతోటి చక్రపాణి ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గురుకుల జూనియర్ కళాశాల లెక్చరర్‌తో పాటు పీజీటీగా, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన కష్టపడి చదువుకుని ఉద్యోగాలపై సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

ముదిగొండ: కంప్రెషర్ ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న పేలుడుపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ గురువారం తెలిపారు. ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా తిరుపతిరావు, కొమ్మరాజుల అనిల్, వెంకటేష్ పది డిటోనేటర్లు, 80 జిలిటెన్ స్టిక్స్ తరలిస్తుండగా కమలాపురం సమీపాన స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈమేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో విజయకేతనం

ఖమ్మం స్పోర్ట్స్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగుతున్న అండర్–14 రాష్ట్రస్థాయి బాలుర క్రికెట్ టోర్నీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సత్తా చాటింది. మూడు రోజులుగా టోర్నీ జరుగుతుండగా, గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఖమ్మం జట్టు రంగారెడ్డి జట్టుపై 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టైటిల్ గెలుచుకుంది. ఈసందర్భంగా క్రీడాకారులను డీఈఓ సోమశేఖరశర్మ, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పాఠశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, స్టెల్లా, కోచ్ విజయ్‌కుమార్ అభినందించారు.

రూ.16.85 లక్షలకు ఐపీ దాఖలు చేసిన కౌలు రైతు

ఖమ్మం లీగల్: జిల్లాలోని ముదిగొండ మండలం మల్లారానికి చెందిన కౌలు రైతు మేడవరపు మోహన్ రావు రూ.16.85 లక్షలకు గాను గురువారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. పలువురి వద్ద వ్యవసాయ భూమి కౌలుకు తీసుకున్న ఆయన పంటల సాగు కోసం అప్పులు చేశాడు. అయితే, పంటలు సరిగ్గా పండక అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ 11 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాదులు పలివెల శ్రీలక్ష్మి, మద్దిల నవీన్‌కుమార్ ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి లీలా సుందరయ్యనగర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీ చేశారు. సుందరయ్య నగర్‌కు చెందిన లచ్చునాయక్, నాగమణి దంపతులు గురువారం ఇంటికి తాళం వేసి కొత్తగూడెం వెళ్లారు. దీంతో దుండగులు అర్ధరాత్రి వెనుక ఉన్న వెంటిలేటర్ పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన సుమారు రూ 2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు శుక్రవారం ఉదయం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్రవాహనం చోరీ

వైరాలో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. గండగలపాడుకు చెందిన ఆర్ఎంపీ పూర్ణకంటి ఏసుదాసు వైరాలోని ఎస్‌వీఎస్ గార్డెన్ రోడ్డులో ఉన్న మచ్చా రామారావు ఇంటికి శుక్రవారం వచ్చాడు. ఆయన ఇంటి ఎదుట వాహనం నిలిపి లోపల వైద్యం చేసి వచ్చే సరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెట్టును ఢీకొట్టిన లారీ.. క్లీనర్ మృతి


ఘటనలో దెబ్బతిన్న లారీ

తల్లాడ: తల్లాడ సమీపాన గురువారం ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో క్లీనర్ మృతి చెందాడు. ఎస్ఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గయ్యపేటకు చెందిన లారీ సత్తుపల్లి నుంచి బొగ్గులోడుతో బయలుదేరింది. ఈ లారీ తల్లాడ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొనగా ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన క్లీనర్ ఒంటిపులి సాంబయ్య(50) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ సీ.హెచ్.లక్ష్మీనారాయణ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో ఆయనను బయటకు తీసి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగాల పేరిట డబ్బు దండుకున్న దంపతుల అరెస్టు

కారేపల్లి: ఉద్యోగాల పేరుతో రూ.1.87 కోట్ల మేర వసూలు చేసిన ఫోర్జరీ సంతకాలతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చిన భార్యాభర్తలను కారేపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన బానోతు ప్రేమ్‌కుమార్–శోభన దంపతులు ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించారు. పోలంపల్లికి చెందిన బానోతు తులసీరామ్ ఇద్దరు కుమార్తెలతో పాటు అదే గ్రామానికి చెందిన గుగులోతు రమేష్, అజ్మీరా దివ్య, పేరుపల్లికి చెందిన బానోతు రఘు నుంచి రూ.1.87కోట్లు కాజేశారు. ఈ సందర్భంగా నిందితులను అరెస్ట్ చేసి ఒక స్కూటీ, ఐదు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్, నకిలీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం తెలిపారు.